క్లుప్తంగా

భవనాల స్థితిగతులు తెలియజేయాలి


తరగతి గదిలో పెచ్చులూడిన పైకప్పును పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి రాజు

పాములపాడు: పాఠశాల భవనాలు, మౌలిక వసతులు, తరగతి గదిలో విద్యార్థులు కూర్చునే బల్లల స్థితి గతులను తెలియజేయాలని మండల ప్రత్యేకాధికారి రాజు సూచించారు. బుధవారం స్థానిక ఏఎస్ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఎస్సీ కాలనీలో ఆదర్శ ప్రాథమిక పాఠశాలలను పరిశీలించారు. విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనం నిర్వహణ గురించి ఆరా తీశారు. ఆయన వెంట ఎంఈఓ సుభాషిణీ దేవి, ఎంపీడీఓ చంద్రశేఖర్ ఉన్నారు.

శ్రీశైలంలో ఉచిత యోగా


యోగాసనాల గురించి వివరిస్తున్న శిక్షకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థాన పరిధిలోని చంద్రవతి కల్యాణ మండపంలో బుధవారం రెండో రోజు ఉచిత యోగా శిక్షణ కార్యక్రమం కొనసాగింది. ఒంగోలుకు చెందిన యోగా గురువు గంధవళ్ల బాలసుబ్రహ్మణ్యం హాజరై భక్తులు, సిబ్బంది, స్థానికులకు యోగాసనాలపై శిక్షణ ఇచ్చారు.

విశేష పూజలు


సాక్షి గణపతి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలో లోకకల్యాణార్థమై బుధవారం సాయంత్రం సాక్షి గణపతికి అభిషేకం, ఆలయ ప్రాంగణంలోని జ్వాలా వీరభద్రస్వామికి విశేషపూజలు నిర్వహించారు. సాక్షి గణపతికి పంచామృతాలతోను, ఫలోదకాలతోను, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోధకం, శుద్ధజలంతో అభిషేకం చేసి విశేషపుష్పార్చన, నివేదన కార్యక్రమాలను చేపట్టారు. జ్వాలా వీరభద్రస్వామివారికి అభిషేకం, విశేష పుష్పార్చన జరిపించారు.

అలరించిన హరికథాగానం



హరికథాగానం వినిపిస్తున్న కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళావేదికపై కర్నూలుకు చెందిన వై.సీ తారామరాజు భాగవతార్.. భూకైలాస్ హరికథాగానం నిర్వహించారు. తబలా సహకారాన్ని ఎం.వెంకటేష్, హార్మోనియం సహకారాన్ని వై.జగదీష్ అందించారు.

నేడు చౌడేశ్వరిదేవి జయంతి


చౌడేశ్వరి దేవి ఆలయం

వెలుగోడు: స్థానిక రెడ్డి గారి వీధిలో వెలసిన చౌడేశ్వరి దేవి జయంతిని గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యుడు యాగంటి రవీంద్రుడు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఆలయంలో ఉదయం 8 నుంచి గణపతి పూజ, పుణ్యాహవాచనం, పంచామృత అభిషేకం, అష్టోత్తర శతనామావళి, దేవి ఖడ్గమాలతో కుంకుమార్చన నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం అమ్మవారిని అలంకరించి పల్లకీలో వుంచి ఆలయ ప్రదక్షిణ ఉత్సవం నిర్వహించనున్నామన్నారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేయనున్నామన్నారు. అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకోవాలన్నారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

బండిఆత్మకూరు: మండల పరిధిలోని జీసీ పాలెం గ్రామానికి చెందిన మాధవ స్వామి వద్ద నుంచి బుధవారం మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ జగన్‌మోహన్ తెలిపారు. మాధవ స్వామి అక్రమంగా మద్యం విక్రయిస్తున్నాడన్న సమాచారంతో సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించి అతని వద్ద నుంచి 11 లిక్కర్ బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

పనుల పరిశీలన

ఆత్మకూరు: మండలంలోని బాపునంతాపురం, కొత్త రామపురం గ్రామాలలో జల్‌జీవన్ మిషన్ ద్వారా జరిగిన పనులను బుధవారం నేషనల్ వాష్ ఎక్స్‌పర్ట్ సిరంజి సఖియా పరిశీలించారు. నీటి నాణ్యతను పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ పి.వాణి, ఆత్మకూరు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఉమాకాంత్‌రెడ్డి, నందికొట్కూరు డీఈ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ సయ్యద్‌ఉమర్, డిప్యూటీ ఎంపీడీఓ బాలునాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పక్కిరయ్య పాల్గొన్నారు.

నమ్మించి నట్టేట ముంచడమే బాబు నైజం

- అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఇచ్చిన హామీలు నెరవేర్చని కూటమి సర్కారు
- మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి


వడ్లరామాపురం గ్రామంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి

ఆత్మకూరు: నమ్మించి నట్టేట ముంచడమే చంద్రబాబు నైజమని వైఎస్సార్‌సీపీ శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి విమర్శించారు. మండలంలోని వడ్లరామాపురం గ్రామంలో బుధవారం సాయంత్రం బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శిల్పా చక్రపాణిరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు గారడీ మాటలు చెప్పి ఓట్లు వేయించుకుని అధికారంలోకి వచ్చాక అమలు సాధ్యం కాదంటూ చేతులు ఎత్తేయడం సిగ్గుచేటన్నారు. సూపర్ సిక్స్ పథకాల పేరుతో అధికారంలోకి వచ్చి ఒక్కటి కూడా పూర్తి స్థాయిలో అమలు చేయలేకపోయారన్నారు.

టీడీపీ నేతలను నిలదీయండి

సుపరిపాలనలో తొలి అడుగు పేరుతో గ్రామాలకు వచ్చే కూటమి టీడీపీ నాయకులను ఏం చేశారని ఎక్కడికక్కడే నిలదీయాలని మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి సూచించారు. కనీసం ఒక్క కొత్త పింఛన్ ఇవ్వకుండా, పెట్టుబడి సాయం డబ్బు వేయకుండా, ఉచిత గ్యాస్ సిలిండర్ అమలు చేయకుండా ఏ ముఖం పెట్టుకుని వచ్చారని చొక్కా పట్టుకుని అడగాలన్నారు. మహిళలకు రూ.1,500, ఉచిత బస్ సౌకర్యం మాటేంటని ప్రశ్నించాలన్నారు.

ఆదరణ పొందిన పథకాలకు మంగళం

ప్రజల ఆదరణ పొందిన వైఎస్సార్‌సీపీ హయాంలోని సంక్షేమ పథకాలకు కూటమి ప్రభుత్వం మంగళం పాడిందని శిల్పా చక్రపాణిరెడ్డి ఆరోపించారు. గత ప్రభుత్వంలోని పథకాలకే పేర్లు మార్చి సూపర్ సిక్స్ పథకాలంటూ ఎన్నికల ముందు హడావుడి చేసిన కూటమి నేతలు.. అధికారంలోకి వచ్చిన తర్వాత అన్నింటినీ గాలికొదిలేసి అన్ని వర్గాలను మోసం చేశారన్నారు. ప్రతిఇంటికి ఉద్యోగం ఇస్తామని, లేనియెడలా నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి నిరుద్యోగలను వెన్నుపోటు పొడిచారన్నారు.

బుడ్డా.. మేం చేసిన అభివృద్ధి కనిపించడం లేదా?

శ్రీశైలం నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధి కనిపించడం లేదా అని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డిని శిల్పా చక్రపాణిరెడ్డి ప్రశ్నించారు. వడ్ల రామాపురం గ్రామంలోనే రూ.13.16 కోట్లతో అభివృద్ధి పనులు చేశామన్నారు. ఎన్నోయేళ్లుగా గ్రామస్తులు కలలుకంటున్న డొంగు రస్తాను తన హయాంలోనే పూర్తి చేశామన్నారు. వడ్ల రామాపురం నుంచి కొట్టాల చెరువు గ్రామానికి నూతన రహదారితో పాటు ఎన్నో అభివృద్ధి పనులు చేశామన్నారు. పిట్టలదొర కథలా రూ.150 కోట్లతో అభివృద్ధి చేస్తానని గొప్పలు చెప్పుకోవడం కాదని, అభివృద్ధి చేసి చూపాలని శిల్పా సవాల్ విసిరారు.

వడ్లరామాపురాన్ని మరింత అభివృద్ధి చేస్తా

మరోసారి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడితే వడ్లరామాపురం గ్రామాన్ని సొంత గ్రామంలా అభివృద్ధి చేస్తానని శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. తాను టీడీపీలో ఉన్నప్పుడు కూడా వడ్ల రామాపురం గ్రామాన్ని అభివృద్ధి చేశానని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనూ తాను ఎమ్మెల్యేగా గెలిచి అభివృద్ధి చేశానని గుర్తు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ శ్రీశైలం నియోజకవర్గ నాయకులు శిల్పా భువనేశ్వర్‌రెడ్డి, మండల అధ్యక్షులు రాజమోహన్‌రెడ్డి, నాయకులు రాజారెడ్డి, బాలస్వామియాదవ్, మౌలాలి, పుల్లారెడ్డి, శివశంకర్‌నాయుడు, ముస్తఫా, సుల్తాన్, గోవింద్ పాల్గొన్నారు.

చదువుపై దృష్టి సారించాలి

పాములపాడు: విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలని ఎస్ఐ సురేష్‌బాబు సూచించారు. బుధవారం స్థానిక ఏఎస్ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డ్రగ్స్ నిరోధకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెడు వ్యసనాలకు దూరంగా ఉండి బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలన్నారు. ఆన్‌లైన్ గేమ్స్‌లో ఎంతోమంది నష్టపోయారని, వాటి జోలికి వెళ్లొద్దని సూచించారు.

- వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా కలిగి ఉండాలని ఎస్ఐ సురేష్‌బాబు తెలిపారు. కర్నూలు–గుంటూరు ప్రధాన రహదారిపై వాహనాల తనిఖీ చేపట్టి పలు ధ్రువపత్రాలను పరిశీలించారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలని సూచించారు.

ఆజాద్‌కు నివాళి

శ్రీశైలంప్రాజెక్ట్: విప్లవ వీరుడు చంద్రశేఖర్ ఆజాద్ జయంతి సందర్భంగా బుధవారం సున్నిపెంటలోని భగత్‌సింగ్ కాలనీలో ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీయూసీఐ నాయకులు వై.ఆశీర్వాదం, వై.శ్రీను, కె.వెంకటేశం, షేక్షావలి, జి.డానియేల్, కె.కన్న మ్లల్లమ్మ, శివ, అబ్దుల్‌బాషా పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల బిగింపును నిలిపేయాలి


మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు

ఆత్మకూరు: స్మార్ట్ మీటర్ల బిగింపును తక్షణమే నిలిపేయాలని, విద్యుత్ సర్దుబాటు చార్జీలను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు వి.యేసురత్నం, వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గురుశేఖర్, బహుజన సమాజ్ పార్టీ శ్రీశైలం నియోజకవర్గ అధ్యక్షులు చంద్రశేఖర్, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని డాక్టర్ ఎ.ధనుంజయ మీటింగ్ హాల్‌లో ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రౌండ్‌టేబుల్ సమావేశంలో వారు మాట్లాడారు. గత ఏడాది ప్రజలపై వేసిన అదనపు భారాలు రూ.15526 కోట్లు రద్దు చేయాలన్నారు. బిగించిన మీటర్లను తొలగించాలన్నారు. పెంచిన విద్యుత్ సుంకాన్ని తగ్గించాలని, 2024–25లో అదనంగా వసూలు చేసిన రూ.2,787 కోట్లను తిరిగి చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు డి.రామ్‌నాయక్, చందావారి వెంకటేశ్వర్లు, సురేంద్ర, మాబాషా, దినేష్, షేక్షావలి, ఆశీర్వాదం, సామేలు, బంగారు, శివుడు తదితరులు పాల్గొన్నారు.

కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దు


విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్న దృశ్యం

కొత్తపల్లి: కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయరాదని కంటి వైద్యులు షేక్షావలి విద్యార్థులకు సూచించారు. బుధవారం స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 38 మందికి దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించామని, వారికి ఉచితంగా కంటి అద్దాలు ఇవ్వనున్నామని చెప్పారు. ప్రిన్సిపాల్ కృష్ణాబాయి, హెచ్ఎం వెంకటరమణ పాల్గొన్నారు.

మహానందిలో వర్షం


వర్షం కురుస్తున్న దృశ్యం

మహానంది: మహానంది పుణ్యక్షేత్రంతో పాటు మండల పరిధిలో బుధవారం వర్షం కురిసింది. సుమారు రెండు గంటల పాటు ఏకధాటిగా కురిసిన వర్షంతో మహానందీశ్వరస్వామి దర్శనానికి వచ్చిన భక్తులు అవస్థలు పడ్డారు.

మహానందీశ్వరుడిని దర్శించుకున్న సెంట్రల్ మానిటరింగ్ టీం

మహానందీశ్వరుడిని బుధవారం కేంద్ర ప్రభుత్వ పథకాల పర్యవేక్షణ సభ్యులు సంతోష్, సూర్య పరీడాలు దర్శించుకున్నారు. ముందుగా వారికి ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ మల్లికార్జున స్వాగతం పలికారు. అనంతరం వారు కామేశ్వరీదేవి, మహానందీశ్వర స్వామి వార్లను దర్శించుకుని పూజలు నిర్వహించుకున్నారు.

పంటలు కాపాడుకోండి

పాములపాడు: పంటలు కాపాడుకోవాలని ఉద్యాన శాఖా అధికారిణి హరిచందన రైతులకు సూచించారు. బుధవారం చెలిమిల్ల, లింగాల గ్రామాల్లో డ్రాగన్ ఫ్రూట్, బెండ, ఉల్లి, నిమ్మ పంటలను పరిశీలించారు. వర్షాలు కురుస్తున్నందున ఉద్యాన పంటలకు తెగుళ్ల సోకే అవకాశం ఉందన్నారు.

గడువు పొడిగింపు

నందికొట్కూరు: అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తు గడువు ఈనెల 31 వరకు పొడగించినట్లు ఐసీడీఎస్ సీడీపీఓ మంగావళి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తపల్లి మండలం జానాల గూడెం పోస్టును రద్దు చేశామని, మిడుతూరు మండలం పైపాలెం అంగన్‌వాడీ ఆయా పోస్టుకు ఓసీ(వీహెచ్) మహిళలు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

చెంచులకు పథకాలు అందించాలి

కొత్తపల్లి: గిరిజనులను సంక్షేమ పథకాలను అందించాలని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్ లింగాల నాగరాజు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన ఎదురుపాడు గూడెంను సందర్శించారు. ఐటీడీఏ అధికారుల నిర్లక్ష్యం వల్ల చెంచులకు పథకాలు అందడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ, ఎస్టీ పరిరక్షణ సమితి అధ్యక్షులు వేల్పుల విజయ్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం పడిగాపులు


పగిడ్యాల సహకార సొసైటీ వద్ద యూరియా కోసం పడిగాపులు కాస్తున్న రైతులు
(ఇన్‌సెట్) స్టాక్ బోర్డులో నమోదు చేయని ఎరువుల వివరాలు

పగిడ్యాల: యూరియా కోసం రైతన్నలు పడిగాపులు కాస్తున్నారు. మండల పరిధిలోని నెహ్రూనగర్, ముచ్చుమర్రి, పగిడ్యాల, లక్ష్మాపురం, ప్రాతకోట, బీరవోలు, సంకిరేణిపల్లె, తదితర గ్రామాల రైతులు బుధవారం తెల్లవారుజాము నుంచే స్థానిక సహకార సొసైటీ కేంద్రానికి చేరుకున్నారు. పాస్‌పుస్తకాలు వరుసలో పెట్టి గంటల తరబడి వేచి చూశారు. యూరియా కృత్రిమ కొరత సృష్టించడం, అక్కడక్కడా లభించినా దుకాణాదారులు ఇతర ఎరువులు అంటగడుతుండటంతో అన్నదాతలు ఆర్థిక భారంతో అల్లాడిపోతున్నారు.

కానరాని స్టాక్ వివరాల నమోదు

ఫర్టిలైజర్ దుకాణాల వద్ద స్టాక్ బోర్డుల్లో స్టాక్ వివరాలు నమోదు చేయడం లేదు. ఏఏ రకం ఎరువులు ఎన్ని బస్తాలు ఉన్నాయో? బస్తా ధర ఎంతో తెలియజేసే వివరాలేవీ ఏ దుకాణం వద్ద కూడా కనిపించడం లేదు. మరోవైపు మండల వ్యవసాయ అధికారి మురళీధర్ మండల కేంద్రంలోని మల్లికార్జున ఎరువల దుకాణాన్ని తనిఖీ చేశారు. యూరియాను రైతులకు విక్రయించాలని ఆదేశించారు. అనంతరం వ్యవసాయాధికారి మాట్లాడుతూ యూరియా ఎక్కడా కొరత లేదని చెప్పారు. యూరియా లేదని ఏ దుకాణాదారుడైనా చెబితే వెంటనే 8331057460కు సమాచారం ఇవ్వాలన్నారు.

యూరియా ఇవ్వండి సార్

కొత్తపల్లి: యూరియా ఎప్పుడు వస్తుందో తెలియక గ్రామాల్లోని రైతు సేవ కేంద్రాల వద్ద రైతులు పడిగాపులు కాస్తున్నారు.

యూరియా వాడకం తగ్గించాలని రైతులకు అధికారులు వివరిస్తున్నా.. అధిక శాతం మొక్కజొన్న పంటలు వేసుకోవడంతో పైర్లు పెరగాలంటే యూరియా తప్పనిసరిగా వేయాల్సిన పరిస్థితి నెలకొంది. బుధవారం ఎం లింగాపురం గ్రామ శివారులో ఉన్న యూరియా స్టాక్ పాయింట్ రూము వద్ద రైతులు గంటల తరబడి ఎదురుచూశారు. వ్యవసాయ అధికారులు స్పందించి అవసరమైన ప్రతి రైతుకు యూరియా అందేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

క్షయ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

పాములపాడు: క్షయ రహిత సమాజాన్ని నిర్మించడానికి ప్రతి ఒక్కరూ సహకారించాలని వైద్యాధికారి మల్లికార్జున, టీబీ సూపర్‌వైజర్ చెరకు రవికుమార్ కోరారు. బుధవారం వేంపెంట సచివాలయంలో క్షయ వ్యాధిపై అవగాహన కలిగించారు. టీబీ లక్షణాలు ఉన్న వారు గళ్ల పరీక్షలు చేయించుకోవాలన్నారు. నిర్ధారణ అయితే ఆందోళన చెందాల్సిన అవరం లేదని, క్రమం తప్పకుండా మందులు వాడి నయం చేసుకోవాలని సూచించారు.

గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుకు దరఖాస్తు చేసుకోండి

నందికొట్కూరు: గవర్నమెంట్ జూనియర్ కళాశాలలో హిస్టరీ(చరిత్ర) గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రఘురామాచార్యులు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ చరిత్రలో పీజీ, డిగ్రీ చదివి కనీసం 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి ఉండాలన్నారు. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. విద్యార్హత పత్రాలను జత చేసిన బయోడేటాను కళాశాల కార్యాలయంలో అందజేయాలన్నారు. ఈనెల 28న ఇంటర్వ్యూ ఉంటుందన్నారు.

సంక్షిప్తం

'ఇలాగుంటే ఎలా నడవాలి సార్'


రోడ్డుపై నిలిచిన వర్షపునీటిని ఎమ్మెల్యేకు చూపుతున్న కాలనీవాసులు

జూపాడుబంగ్లా: డ్రైనేజీల్లేక చిన్నపాటి వర్షం కురిసినా నీరు రోడ్లపైనే నిల్వ ఉంటోందని మండల కేంద్రంలోని కాసా నగర్ వాసులు బధవారం ఎమ్మెల్యే జయసూర్యకు విన్నవించారు. తొలి అడుగు కార్యక్రమంలో ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యేక రచ్చకట్ట సమీపంలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు చూపి ఎలా రాకపోకలు సాగించాలి సార్ అంటూ ప్రశ్నించారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే బాగు చేయించాలని ఈఓపీఆర్డీ, ఎంపీడీఓ, ఏపీఓలను ఆదేశించారు.

కబ్జాదారులపై కేసులు నమోదు చేయాలి

నందికొట్కూరు: ఎన్టీఆర్ జలాశయాన్ని ఆంజనేయ స్వామి పేరుతో కబ్జా చేసిన రాజకీయ నాయకులపై కేసులు నమోదు చేయాలని సీపీఎం నాయకులు నాగేశ్వరరావు కోరారు. బుధవారం కబ్జాకు గురైన కర్నూలు రోడ్డులో ఉన్న ఎన్టీఆర్ జలాశయాన్ని సీపీఎం నాయకులు పరిశీలించారు. 1996లో పంచాయతీలో తీర్మానం చేసి 1.96 ఎకరాల భూమిని అప్పటి ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జలాశయాన్ని నిర్మించారన్నారు. అధికారుల సహకారంతోనే ఎన్టీఆర్ జలాశయం కబ్జాకు గురైందని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కర్ణ, గోపాలకృష్ణ, జయరాణి, నాగన్న, తిరుపాలు, ఉస్మాన్ పాల్గొన్నారు.

తాగునీరు అందిస్తాం

కొత్తపల్లి: గిరిజనులకు సురక్షితమైన తాగునీరు అందిస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఈ శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం సంగమేశ్వరం, జానాల గూడెం, బలపాలతిప్ప, సిద్ధేశ్వరం చెంచు గూడేలలో తాగునీటి పథకాల కోసం స్థల పరిశీలన చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఎస్ఎండీ జుబేర్, సర్పంచ్ బాల ఎల్లయ్య ఉన్నారు.

సభలు జయప్రదం చేయండి

కొత్తపల్లి: ఈనెల 31న డోన్‌లో నిర్వహించే జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి కేతం వెంకటశివుడు యాదవ్ కోరారు. బుధవారం బస్టాండ్ ఆవరణంలో మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో సీపీఐ శాఖ కార్యదర్శి భీమలింగం పాల్గొన్నారు.

యూరియా అందించడంతో ప్రభుత్వం విఫలం

నందికొట్కూరు: రైతులకు సరిపడా యూరియాను అందించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని సీపీఐ(ఎంఎల్) జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు ఆరోపించారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. యూరియా ఎరువులు అందక రైతులకు రోడెక్కినా కూటమి ప్రభుత్వంలో ఎలాంటి చలనం లేదన్నారు. జిల్లా అధికారులు స్పందించి యూరియాను రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు సోమన్న, గాబ్రియేల్, శివకుమార్, తిరుపాలు, బీబీ, లక్ష్మిదేవి పాల్గొన్నారు.

గుంతలు.. అధికారుల కళ్లకు గంతలు!

- గుంతమయమైన గ్రామీణ రోడ్లు
- నీరు నిలిచి ప్రమాదాలకు కారణమవుతున్న వైన్యం
- పట్టించుకోని పాలకులు

నిర్లక్ష్యపు గంతలు కట్టుకున్న అధికారులు ఒకవైపు.. ఏరు దాటాక తెప్ప తగలేసే ప్రజాప్రతినిధులు మరో వైపు ఉండగా.. పల్లె రోడ్లను బాగుచేసే నాథుడు ఇంకెక్కడ ఉంటారు. అడుగుకో గుంత.. ఆపై వర్షపు నీరు నిలిచి ప్రమాదాల బారిన పడుతున్న ప్రయాణికుల బాగోగులు పట్టేదెవరికి? అభివృద్ధిని పరుగులు పెట్టిస్తామంటూ ఊదరగొట్టిన కూటమి నేతల జాడేది? ప్రమాదాల బారిన పడుతున్న ప్రయాణికుల ఆర్తనాదాల ఉసురు కొట్టుకోకముందే రోడ్లను బాగు చేయించాలని పలువురు కోరుతున్నారు.


తెలుగుగంగ కట్ట మీదుగా బావులను తలపిస్తున్న గుంతల్లోని నీరు


మండల కేంద్రం ఎం.తిమ్మాపురంలో..

మహానంది: మండలంలో 13 గ్రామ పంచాయతీలు, ఐదు మజారా గ్రామాలున్నాయి. దాదాపు అన్ని గ్రామాల్లో గత ప్రభుత్వాల హయాంలో నిర్మించిన రోడ్లు మాత్రమే కనిపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్మించిన ఒకటి రెండు రోడ్లు పెద్దగా ప్రయోజనాలు చేకూర్చేచోట కాకుండా నాయకుల స్వార్థం కోసం నిర్మించినవే ఉన్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పాలకులు పట్టించుకోకపోవడం, అధికారుల్లో చిత్తశుద్ధి లేకపోవడంతో రోడ్లన్నీ ఛిద్రమైపోతున్నాయి. ఏ గ్రామంలో చూసినా వర్షపు నీళ్లతో నిండిన రోడ్లే దర్శనమిస్తున్నాయి.


అదుపు తప్పితే అంతే..

మహానంది మండలంలో అత్యధికంగా అరటి సాగు చేస్తుంటారు. దీంతో సీజన్‌లో వందల లారీలు అరటి గెలలతో మహానంది సమీపంలోని తెలుగుగంగ కాల్వ వెంట ఎంసీ ఫారం, బోయిలకుంట్ల మీదుగా గుంటూరు వైపు వెళ్తాయి. వీటితో పాటు రైతులు, వ్యవసాయ కూలీలు పొలాలకు, వ్యవసాయ కళాశాల, వెంకటేశ్వర పశుపరిశోధన స్థానం, రైల్వేస్టేషన్‌లు ఉండటంతో అక్కడికి వేలాది మంది రాకపోకలు సాగిస్తున్నారు. కాలువ వెంట ఉన్న కట్ట దారిపై పెద్దపెద్ద గుంతలు ఉండటంతో ఏ మాత్రం అదుపు తప్పినా తెలుగుగంగలో గల్లంతవడం ఖాయమని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆస్పత్రికి వెళ్లేసరికి నొప్పులు ఎక్కువ

గాజులపల్లెలో పెట్రోల్ బంక్ పక్కన ఉన్న దారి వెంట విద్యుత్ సబ్‌స్టేషన్, 24 గంటల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, జిల్లా పరిషత్ పాఠశాల, మసీదుతో పాటు గ్రామంలో వెళ్లాలి. వీటన్నింటిలో వివిధ పనుల నిమిత్తం వెళ్లే వారు ఎక్కువ. ఎప్పుడో ఏళ్ల క్రితం నిర్మించిన సీసీ రహదారి కాలు తీసి కాలు పెట్టే దూరంలో అన్నీ గుంతలే ఏర్పడ్డాయి. దీంతో ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు, ఆస్పత్రికి వెళ్లే రోగులు పడుతున్న బాధలు అన్నీ, ఇన్నీ కావు. బుక్కాపురంలోని రైతు భరోసా కేంద్రం వద్ద రోడ్డు పాడవడంతో నీళ్లన్ని నిలిచిపోతున్నాయి. మహానంది వెళ్లే మార్గంలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద రోడ్డు కోసుకుపోయింది. తమ్మడపల్లె నుంచి సూర్యనంది వెళ్లే దారి, నందిపల్లె నుంచి రైలుగేటు మీదుగా సీతారామపురం వెళ్లే రోడ్డు, సీతారామపురం నుంచి మసీదుపురం వెళ్లే రహదారులు అన్నీ ఛిద్రమై ఛీ..ఛీ రోడ్లులాగా దర్శనమిస్తున్నాయి. కూటమి నేతలు ఇప్పటికైనా స్పందించి రహదారులకు మరమ్మతులు చేయడంతో పాటు నూతన రోడ్లు నిర్మించాలని రైతుల, మండల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

రైతులకు నిత్యం కష్టాలే..


జమాలయ్యదర్గా మార్గంలో అడుగడుకూ గుంతలే ఇలా

మండల కేంద్రం ఎం.తిమ్మాపురం నుంచి జమాలయ్య దర్గా మీదుగా సుమారు 3.88 కిలో మీటర్ల దూరం ఉంది. పదేళ్ల క్రితం రూ.30 లక్షలకు పైగా వెచ్చించి ఈ దారిని నిర్మించారు. అప్పటి నుంచి నేటి వరకు దారికి ఎలాంటి మరమ్మతులు చేపట్టకపోవడంతో మూడు కిలోమీటర్ల రోడ్డు గుంతలమయమైంది. దీంతో పొలాలకు ఎరువులు, విత్తనాలు, వరినారు, అరటి పిలకలు తీసుకెళ్లే రైతులు నరకం చూస్తున్నారు. ఈ దారి మీదుగా పొలాలతో పాటు మహానంది క్షేత్రానికి, అక్కడి నుంచి ఓంకారం పుణ్యక్షేత్రం, కృష్ణనంది, శివనంది ఆలయాలకు భక్తులు వెళ్తుంటారు. ప్రస్తుతం రోడ్లు ఛిద్రమైపోవడంతో ప్రయాణికులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. ఎం.తిమ్మాపురం రింగ్ రోడ్డు వెంట ప్రారంభంలో రోడ్డు మరింత దారుణంగా ఉంది.